# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 1

పేజీలు 40

సెప్టెంబర్ 2016

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో .............................. ....... పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ........................................3

అమ్మమాట........................................6

అధికారి ........................................8

ముత్యాల సరాలు ........................................9

అహంకారమే దొంగ ........................................10

యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ........11

శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు..13

కృష్ణాపుష్కర సత్సంగామృతం ..................14

లలాటరేఖ ........................................16

గుణాలపై విజయం ........................................18

మాయ ........................................20

యోగవాశిష్ఠము ........................................21

దేవతాచార్చన ........................................23

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................25

పరిప్రశ్న ........................................26

పరమాత్మ దర్శనము ........................................28

పూజలెన్నో చేశాము పూర్వజన్మలో............30

శ్రీకృష్ణకర్ణామృతము........................................31

గీతాధ్యయనమ్ ........................................33

జమదగ్నిమహర్షి ........................................35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర.....37

విష్ణు కథలు- సూరదాస్ ..............................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అథాశ్వలాయనో భగవంతం పరమేష్టిన ముపసమేత్యోవాచ
అధీహి భగవన్ బ్రహ్మవిద్యాం వరిష్ఠాం ।
సదాసద్భిః సేవ్యమానాం నిగూఢాం ।
యయాచిరాత్ సర్వపాపం వ్యపోహ్య ।
పరాత్పరం పురుషం యాతి విద్వాన్ ॥

(కైవల్యోపనిషత్ - 1శ్లో॥)

అశ్వలాయనుడు ఆచార్యుడే. ఆత్మ విచారణ పరమాత్మ తత్త్వంపై ధ్యానం చేసిన మహాత్ముడే. అంతేకాదు వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షత్వం గల జ్ఞానసంపన్నుడే. తాను ఇంతవరకు పొందిన జ్ఞానము సరియైనదని ఆమోద ముద్ర పొందటానికి, పరమాత్మ తత్త్వాన్ని గురించి మరింత తెలుసుకోవటానికి ఆధ్యాత్మిక విద్యకు ప్రధమ ఆచార్యుడు సృష్టికర్త అయిన బ్రహ్మను ఆశ్రయించి పరాత్పరుడైన పరమ పురుషుని చేరటానికి అనుసరించదగిన బ్రహ్మవిద్యను బోధించమన్నాడు.

ఆయన కోరిన బ్రహ్మవిద్య నిగూఢమైనది. అది గ్రంథ పఠనం ద్వారా, శాస్త్ర వ్యాఖ్యానాల ద్వారా, లేదా లక్షణ వాక్యాల ద్వారాగాని తెలుసుకొనబడదు. అలాగని రహస్యమైనదని కాదు. అది ఇంద్రియాలకు అందనిది అని అర్థం.

ఆ పరమసత్యాన్ని తెలుసుకొన్నవాడు దేహమనోబుద్ధుల ద్వారా వ్యవహరించ లేడు. అంటే వాసనలు నశించవలసినదేనన్న మాట. వాసనలు బుద్ధిలో సంకల్పాలుగా, మనస్సులో విక్షేపాలుగా, దేహంలో క్రియా రూపంగా సంతరించుకుని ఉంటాయి.

బ్రహ్మవిద్య ద్వారా దేహ మనో బుద్ధులను ప్రేరణ చేసే జీవభావం రహితమవుతుంది. కారణశరీరాన్ని దాటినప్పుడే అది సాధ్యపడుతుంది. కాబట్టి దానిని అధిగమించటానికి తోడ్పడే తత్త్వానుభూతిని బోధించమని కోరాడు. కైవల్యం అంటే అదే. మానవజన్మ వచ్చినందుకు ఆ స్థితిని పొందటానికి అదొక్కటే శరణ్యం.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

గోపికలు శ్రీకృష్ణ పరమాత్ముని దర్శనం, స్పర్శనం, వందనం మరియు సంభాషణల ద్వారా తమ జన్మను సార్థకం చేసుకున్నారు కాబట్టి సగుణభక్తి గొప్పదా? లేక నిర్గుణ భక్తి గొప్పదా? అని సందేహము వెలిబుచ్చిన భక్తునికి సమాధానం చెబుతూ " భక్తి సగుణమైనదే. విశ్వాసము నిర్గుణమైనది. సాధకుడు ముందుగా ఒక పూజా మందిరాన్ని ఏర్పరచుకుని పూజ, అలంకరణ, నైవేద్యం, హారతి, అర్చన అలవరచుకుంటాడు. దాని ద్వారా భగవంతుని యందు భక్తి పెంపొందుతుంది. ధ్యానము కూడా సగుణమైనదే. ధ్యానము ద్వారా పొందే అనుభూతులన్నీ మనస్సు ద్వారా పొందేవే కాబట్టి అవన్నీ సగుణమైనవే. సాధకుడు వేదాంత గ్రంథాలు, పురాణాలు, భక్తుల చరిత్రలు చదివి భక్తిని పెంపొందించు కోవచ్చు. ఇంకా నామసంకీర్తనలో పాల్గొనవచ్చు. పురాణ శ్రవణం చేయవచ్చు. నామస్మరణ చేయవచ్చు. ఎన్ని చేసినా సద్గురుమూర్తి ఆశ్రయము లభించనిదే భక్తిగానీ, విశ్వాసముగానీ బీజదశలోనే ఉంటాయి. నిర్గుణోపాసన అంటే మానసిక ఆరాధన. సగుణోపాసనలో ఉన్మాదస్థితిలో ఉన్న మనస్సు నిర్గుణతత్త్వాన్ని పొందదా? సగుణోపాసన గొప్పదా? నిర్గుణోపాసన గొప్పదా? అన్న ప్రశ్నకు సమాధానం దీపం గొప్పదా? దీపము ద్వారా వచ్చే కాంతి గొప్పదా? అన్నట్లుగా ఉంటుంది. సూర్యభగవానుడు గొప్పవాడా? ఆయన అందజేసే కాంతి కిరణములు గొప్పవా?" అన్నారు.



"ఎన్నిపూజలుచేసినా, ఎన్నిపుష్పాలు సమర్పించినా ఎన్ని పదార్థాలు నివేదన చేసినా సద్గురు మూర్తికిగానీ, భగవానునికి గానీ నిర్మలమైన మనస్సుతో, భక్తితో ప్రేమతో సమర్పించినదే గొప్పగా పరిగణింపబడుతుంది. భక్తిలేని సాధనగానీ, ఆరాధనగానీ, ఉపాసనగానీ అవి సగుణోపాసనైనా నిర్గుణోపాసనైనా శిరస్సులేని మొండెమువంటిది. సద్గురుమూర్తి యెడల అచంచల భక్తి విశ్వాసములు, వినయ విధేయతలు కలిగి ఉండడమే సాధకునికి సరైన ఆరాధన. సగుణోపాసన నిర్గుణోపాసనల కన్న గురువాజ్ఞాపాలన చాలా గొప్పది. సమర్థులైన సద్గురుమూర్తి ఆశ్రయం లభించినపుడు భక్తిబీజము అంకురించి శాఖోపశాఖలై విస్తరించి పరిపక్వస్థితికి చేరుతుంది. పరిపక్వస్థితికి చేరిన భక్తుడు సద్గురుమూర్తి

చేసిన బోధని సక్రమంగా శ్రవణం చేసి దానిని మననం చేయడం ప్రారంభిస్తాడు. బోధాశ్రవణం సగుణం. మననం, విచారణ నిర్గుణము. బోధాశ్రవణం చేయకుండా మననము విచారణ సాధ్యము కాదుకదా. కాబట్టి సగుణభక్తి నిర్గుణస్థితికి తీసుకువెడుతుంది. గోపికలు శ్రీకృష్ణ భగవానుని దర్శనము, స్పర్శ వందనము, సంభాషణల ద్వారా అచంచల మైన భక్తి పెంపొందించుకుని ఆయనలేని స్థితిని ఒక్క క్షణమైనా ఊహించలేకపోయారు. ఆయనతో ఆడుకున్నారు. ఎన్నో అనుభూతులు పొందారు. ఆయననే వారి ఆరాధ్యదైవంగా భావించారు. ఆయన తత్త్వాన్ని తెలియజేసే నిమిత్తం తాను వ్రేపల్లెవాడనుండి మధురకి తరలి వెళ్ళిపోయాడు. అయినా గోపికలు మానసిక ఆరాధన పెంపొందించుకుని సర్వత్రా శ్రీ కృష్ణ పరమాత్మనే దర్శించారు. ఆనందాన్ని పొందారు.

ఇప్పుడు మీరు చెప్పండి. సగుణోపాసన గొప్పదా? నిర్గుణోపాసన గొప్పదా? ఏ రకమైన ఉపాసనైనా భక్తి ప్రధానమైనది. కులశేఖర ఆళ్వార్ భగవంతుని కీర్తిస్తూ ఏ ఉపాధితో కూడినా, ఎన్ని జన్మలెత్తినా, భగవానుని దివ్య చరణారవిందముల యందు. అచంచల భక్తిని ప్రసాదించిన జన్మచాలు అని కోరుకోలేదా? నిజమైన భక్తుడు కోరుకునేది భగవంతుని సాలోక్యమైనా, సారూప్యమైనా, సాన్నిధ్యమైనా, సాయుజ్యమైనా ఏదైనా సరే అది ఆనందాన్నివ్వదా? భగవంతుని తన మనస్సులో నిలుపుకున్నా, లేక తన మనస్సుని భగవానునియందు నిలిపినా పొందే ఆనందంలో ఏమైనా తేడా ఉంటుందా? మీరే నిర్ణయించండి - పెద్దలు చదువుకున్నావారు - అమృతము గ్రోలినవాడు గొప్పవాడా? లేక అమృతంలో మునిగినవాడు గొప్పవాడా? నిర్ణయించండి. రామరసాన్ని గ్రోలుతూ ఆనందించే వాడు గొప్పవాడా? రామనామ స్మరణలో మునిగి ఉన్మాదస్థితిలో ఉన్నవాడు గొప్పవాడా? దీనిని నిర్ణయించగల సమర్థులు ఎవరు? దానిని పొందేవాడు గానీ లేక ఆనందలహరిలో ఒలలాడే సాధకుని స్థితిని గమనించిన సద్గురుమూర్తి మినహా ఎవరు చెప్పగలరు? అర్జునుడు విశ్వరూప సందర్శనం తర్వాత శ్రీకృష్ణపరమాత్మని సగుణ భక్తి గొప్పదా? నిర్గుణభక్తి గొప్పదా? అని ప్రశ్నించాడు. శ్రీ కృష్ణ పరమాత్ముడు సమాధానం చెబుతూ 'ఎవరైతే మనస్సు నాయందే నిలిపి ఉపాసన చేస్తారో వారు గొప్పవారు' అని అన్నాడు. నిజమైన భక్తుడు ఏ పనిచేస్తున్నా, సంసారంలో ఉన్నా, సన్యాసి అయినా, బ్రహ్మచారి అయినా మనస్సు భగవానుని దివ్యచరణార విందములయందు నిలిపి ఉంచాలి. నిర్గుణభక్తి అంటే మానసిక భక్తి. భక్తి సగుణమైనా నిర్గుణమైనా భగవద్గీతలో చెప్పబడినట్లు సమస్త

జీవరాసులయందు సమదృష్టి కలిగి ఉండాలి. అనగా *సర్వభూతహితేరతాః* అన్న శ్లోకాన్ని తాను ఆచరణలో పెట్టాలి.”

“తాము ఆశ్రయించిన సద్గురుమూర్తి సేవచేస్తూ తరించిన భక్తులు లేరా? అంతేకాదు త్యాగరాజు భక్తితో, ఆర్తితో భగవంతుని కీర్తించి తాను తరించడమేకాక ఎంతమందికో మార్గదర్శకులు కాలేదా! తాను ఆశ్రయించిన గురుమూర్తి గొప్పవాడా? ఆయన అందించే తత్త్వము గొప్పదా? తాను ఆశ్రయించిన గురుమూర్తియందు భక్తివిశ్వాసములు పెంపొందే కొలది ఆయన అందించే తత్త్వాన్ని అర్థం చేసుకోగల్గుతారు. దీనిని గ్రహించండి చాలు. ఎంతటివాడైనా గురుసాన్నిధ్యంలో అద్వైతానికి తావులేదు. సద్గురు మూర్తికి ఉన్నతస్థానం ఇవ్వవల్సిందే. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. పుత్రుడు చదువు పూర్తిచేస్తాడు. పెద్ద ఉద్యోగంలో ఉంటాడు. తండ్రియొక్క ఆస్తికి వారసుడే. తండ్రికి పుత్రుడన్నా వాత్సల్యమే. అయినా తండ్రి ఉన్నంతవరకూ పుత్రుడు తండ్రికి గౌరవం ఇవ్వవలసిందేగా! తండ్రిని ‘ఏరా నాన్నా! ఎలా ఉన్నావ్?’ అని పిలవగలడా? పోనీ తండ్రి ఎదురుగా కూర్చుని ‘నేను నీ ఈ ఆస్తికి వారసుణ్ణి’ అని చెప్పి ఆ తండ్రి సమక్షంలో సిగరెట్టు కాలుస్తూ అవమానపర్చటం సమ్మతమేనా? ఆయన జీవించి ఉన్నంతవరకు ఆయనకి తగిన గౌరవం ఇవ్వవలసిందేకదా! మరి సాధకుడు జగద్గురువైన సద్గురుమూర్తికి ఏ స్థానాన్ని ఇవ్వాలో ఆలోచించండి? సాధకునికి కావల్సినది తత్పరత లేక ఆవేదన. గాఢమైన ఆవేదన వైరాగ్యాన్ని పెంపొందిస్తుంది. ఆత్మానందాన్ని పొందాలి అనే తపన దేనినైనా త్యాగం చేస్తుంది. గాఢమైన వైరాగ్యమన్నా, భక్తి అన్నా ఒకటే. భగవంతుని యెడల భక్తి ప్రేమని పెంపొందిస్తుంది. విషయాదులమీద ప్రేమ ప్రతిఫలాన్ని కోరుతుంది కాబట్టి దానిని మోహము అంటారు. భక్తిలేని హృదయములో ప్రేమకి తావులేదు. సాధకుని భక్తికి నిదర్శనము తన వాక్కుని గురుతత్త్వ విచారణకీ, ఇంద్రియాలను గురుసేవకీ వినియోగిస్తూ మనస్సుని సద్గురుమూర్తికే సర్వసమర్పణ చేస్తాడు. గోపికలు తమాల వృక్షాన్ని శ్రీకృష్ణ పరమాత్మగా భావించి తమ దేహాన్ని మరచి తన్మయులై తమ మనస్సులలో ఆ మూర్తినే ముద్రించుకున్నారు. వారి భక్తి అపారమైనది. వారు సర్వే సర్వత్రా శ్రీ కృష్ణ పరమాత్మనే దర్శించారు. ఆయననే స్మరించారు. తమ దేహంలో అణువణువునా ఆయననే ముద్రించుకున్నారు. అందుచేతనే వారి మనస్సు తదాకారాన్ని పొంది ఆ వంశీధరునిలో లయమయ్యారు” అన్నారు.

(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాల ప్రసాద

# నిర్మల హృదయ విరాజిత చరణం

'ధ్యానం నిర్విషయం మనః' అని చెబుతోంది మన ఉపనిషత్తు. దాని గురించి ఆలోచించి, మన జీవిత పరమార్థాన్ని గుర్తించలేకపోతే మానవ జన్మను వ్యర్థం చేసుకున్నవాళ్ళమవుతాము. ధ్యానమునందు మనస్సు నిలవాలి అంటే అది నిర్విషయం అవ్వాలని మహాత్ములు శెలవిచ్చి ఉన్నారు. విచారణ ద్వారా మనస్సు నిర్విషయం అవుతుంది. అలా కాకుండా ఇంకా ఇంకా విషయాలనే పోషిస్తూ, 'నేను చేసేదే కరెక్ట్, అదే గొప్పది' అనుకుంటూ పోతే, మనస్సు ఎప్పటికీ విషయరహితమవ్వదు. అది మనలను పతనం చేస్తుంది.



అందుకే వేదమాత మనస్సుని విషయాదుల నుండి ఖాళీ చేసుకోమంటోంది. దానికి ముఖ్యం మనస్సుకు పట్టిన మలినం వదిలించుకోవటం. అదే నిజమైన స్నానం. 'స్నానం మనోమల త్యాగం' అని చెబుతోంది స్కందోపనిషత్తు. అలా అని జపం చేస్తూ వెళితే అది పోదు. కేవలం నిరంతర భగన్నామస్మరణ ద్వారా మాత్రమే మనస్సుకు అంటిన మాలిన్యం వదులుతుంది. నామ రూపంతో కూడిన ప్రభువు యొక్క తత్త్వం విచారణ చేయాలి.

ఇంద్రియ నిగ్రహమనే మడి కట్టుకోవాలి. 'శౌచమ్ ఇంద్రియ నిగ్రహః' - మనకున్న జ్ఞానేంద్రియాలు అయిదు కూడా ఎప్పుడు బాహ్య విషయాలనే గ్రహించి, మన మనస్సును బహిర్ముఖంగా పరుగులు పెట్టిస్తాయి. మనం బజారు వైపుగా ఇక్కడకి వస్తున్నామనుకోండి. దారిలో మామిడిపళ్ళు కనిపించేసరికి మనస్సు వాటిని ఆకర్షించి వాటివైపు పరుగులు తీస్తుంది. ఇంకెన్నో విషయాదుల వెంట పరుగెడుతుంది. అటువంటప్పుడు మీ మనస్సుని వెనక్కు లాగుకోవాలి. విషయాదులతో

కూడి ఉన్నవారు ఎదురుపడితే, మనం దొడ్డిదారి నుండి వారిని తప్పించుకుపోవాలి. వారితో కలిస్తే మన మనస్సు ఇంకా మైలపడుతుంది. గాలిలేనిచోట వెలిగే దీపం లాగ మన మనస్సును నిశ్చలంగా వుంచుకోవాలి. ఆత్మమడి కావాలి.

మన సత్యపరిశోధనకి అడ్డు ఏమి లేదు. సత్యం మన స్వరూపమై ఉంది. జ్ఞానం మన స్వరూపం. కానీ దానినెలా అర్థం చేసుకోవాలో, ఎలా ఉపయోగించుకోవాలో తెలియటం లేదు. ముందుకు రండి! మీ సమయాన్ని భగవంతుడికివ్వండి. దానిలో ఉన్న విషయాన్ని గుర్తించండి. మన కష్టాలన్నీ తన భుజంపై వేసుకుని ఆ ప్రభువు మనలను రక్షిస్తాడు. ఆ ప్రభువు దృష్టిలో వుంటే చాలు!

ఒక సంకీర్తన చేసినా, తత్త్వ విచారణ చేసినా, గురుపాదములే మనస్సునందు నిలుపుకొని వారి ముఖస్తుగా వచ్చిన పదములను నెమరువేసుకుంటూ, ఆచరించాలి. ఇదీ నిజమైన గురుశుశ్రూష. భగవంతుడి అండదండలున్నవాడికి లోటేమిటి?

కనుక మన అనుభూతి ఎలా ఉండాలి? ఆ పాదం సకల చరాచర వ్యాపక చరణమని గుర్తించాలి. పాదుకలు బృందావనంలోనో, ఏడు కొండలమీదనో మాత్రమే లేవు. అవి నీలో లేకపోతే నీవెలా తిరుగగలవు? ఆ దివ్యపాదుకలు ప్రతి నిర్మల హృదయంలో విరాజిల్లుతూ వుంటాయి. 'అట్టి దివ్యచరణారవిందములని శరణు పొందుతున్నాము. నమస్కరిస్తున్నాము' - అని పాటపాడి వదిలివేస్తే సరిపోదు నిజంగానే ఆ అనుభూతిని పొందాలి. ఎవరికివారే విచారణ చేయండి. తింటున్నా, నడుస్తున్నా, పడుకుంటున్నా మన ధ్యాస ఎక్కడ ఉంది? అని గుర్తిస్తూ వెళ్ళండి. గురుస్మరణ గురించి విచారణ చేయండి. ఆయువు వెళ్ళిపోతోంది. ఏ క్షణం మనదో, ఏది మనది కాదో మనకు తెలియదు. త్వరపడండి.

అట్టి అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు మనలను సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# అధికారి

- పరాశర ప్రసాద్

ఆధ్యాత్మవిద్యకు అధికారి ఎవరు? నిర్మల అంతఃకరణముగల సాధకుడే అధికారి. అంతఃకరణ మనగా మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము. దీని యందు మలము, విక్షేపము, ఆవరణ అనే మూడు దోషాలు సహజంగా ఉంటాయి. నిష్కామకర్మ ఆచరించటం వలన మలదోషము, ఉపాసన ద్వారా విక్షేపదోషము, జ్ఞానము ద్వారా ఆవరణదోషము రహితం కాక తప్పదు. ఆ విధంగా అంతఃకరణమునందు త్రివిధ దోషనివృత్తి అయినను అధికారి కానేరడు సుమా.

పవిత్రాంతఃకరణుడుగా సాధన చతుష్టయ సంపత్తిని కలిగి వుండాలి. సాధన చతుష్టయ మనగా వివేకము, వైరాగ్యము, శమాది షట్కసంపత్తి, ముముక్షత్వము. వివేకము, ఇతర సాధనములకు ఆధారమై ఉన్నది. వివేకము కలిగిన సాధకుడు ఆత్మానాత్మ విభేదమును తెలిసికొని 'జగత్తు మిధ్య' అనే పరోక్షజ్ఞానము కలగటానికి మార్గము సుగమము అవుతుంది. కాని అపరోక్ష జ్ఞానము మాత్రము కలుగదు. వైరాగ్యము సాధించటం ద్వారా శమాది షట్క సంపత్తి చేకూరి అధికారియై, ఆత్మజ్ఞాన ప్రాప్తికై తీవ్ర తపన చెందే సాధకుడే ముముక్షువు.

జ్ఞాన సాధనములు రెండు విధాలుగా విభజింపబడినట్లు శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. 1. అంతరంగ సాధనము 2. బహిరంగ సాధనము. సాధనచతుష్టయ సంపత్తి, శ్రవణము, మననము, నిదిధ్యాస, తత్త్వ పదార్థముల శోధనలు అంతరంగ సాధనములుగా పరిగణింప బడతాయి. యజ్ఞయాగాది క్రతువులు, ఉపాసన మొదలైన ప్రక్రియలు బహిరంగా సాధనములు.

ముందుగా బహిరంగ సాధనముల ద్వారా సగుణోపాసన చేస్తూ అంతరంగసాధన ప్రక్రియ ద్వారా జ్ఞానమార్గములో పయనించే సాధకుడు ఆత్మజ్ఞాన సంపన్నుడు కాక తప్పదు. అంతరంగ సాధనలో సాధన చతుష్టయ సంపత్తిని సాధించటమే కాక శ్రవణ, మనన, నిదిధ్యాసలు కూడా జ్ఞానసాధనకి తోడ్పడతాయి. అంతేకాదు తత్త్వం పదార్థముల శోధన అనేది కూడా ఆవశ్యకమే. అదే విచారణ, కారణ కార్యముల సంబంధ విచారణ, ద్రష్ట, దృశ్య విచారణ లాంటివి చేయటం వలన దృఢ అపరోక్ష జ్ఞానము కలగటం తథ్యం!!

# ముత్యాల సరాలు - సంత్ జ్ఞానదేవ్

ఓ మూర్ఖమైన మనసా! నీవు ఊరక అక్కడ యిక్కడ తిరుగుతూ ఉంటావు. ఓ తుంటరి పాపిష్టి మనసా! నీవు నిరంతరం భ్రమిస్తూ వుంటావు. మంచి మంచి బలవంతులకు సైతం నిన్ను అదుపులో పెట్టటం చేతకాదు. చివరకు గురువును శరణు పొందటమే తరణోపాయం.

మనస్సు హరిచరణంలో స్థిరపడి ఆ హరిచరణంలోని మాధుర్యాన్ని చవిచూసిందా యిక మనం మానవులమై ప్రపంచంలోకి వచ్చిన పని పూర్తి అయినట్లే! ఎందుకంటే హరిదర్శనం కలిగిన తోడనే నీవు, నేను అనే భేదం నశిస్తుంది. కాని మనస్సు ఇంత త్వరగా వశం కావటం అంటే అది మామూలుగ అయ్యేపని కాదు.

కాబట్టి జ్ఞానదేవుడు ఇంకో ఉపాయం చెబుతున్నాడు అదేమిటి అంటే .............

మనస్సును నిగ్రహించే పని మానండి; దాన్ని ఇష్టం వచ్చినట్లు తిరగనివ్వండి; మనం కేవలం సాక్షీరూపులమై దాన్ని, దాని చంచలత్వాన్ని చూస్తూ కూర్చుందాం. అలా మనస్సు దానిపాటికది తిరుగుతూ ఉంటే మనం సాక్షి స్వరూపులమై ఆ హరిని శరణు పొందుదాం.

మనం హరిలో స్థిరపడ్డాక గత్యంతరం లేని మనస్సు మన కడకు తిరిగి వస్తుంది. అప్పుడు ఆ లభించే శక్తిని ప్రజాసేవకు, జ్ఞాన సముపార్జనకు మనం వినియోగించుకోవచ్చు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీ బులుసు సూర్యప్రకాష్‌రావుగారు 22-8-2016 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 64 సంవత్సరాలు. శ్రీ సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అహంకారమే దొంగ

-శ్రీ రమణ మహర్షి

ప్రతివారు అహంకారాన్ని నాశనం చేయాలని తరచుగా అంటూ ఉంటారు. ఇట్లా అనేది ఎవరు? అహంకారమే అంటున్నది.

అహంకారం తన నాశనం తాను కోరుకుంటోందా? ఇది ఎన్నటికీ జరిగేది కాదు. పైగా ఇది మరింతగా బలపడుతుంది.

అహంకారం నాశనం కావాలంటే ఒకే ఒక రాజమార్గమున్నది. అదే 'నేనెవడను?' అని ప్రశ్నించుకోవటం. అహంకారం నాశనం కావాలనుకోవటమంటే ఎలా ఉంటుంది అంటే, నాకు చిన్ననాటి ముచ్చట ఒకటి గుర్తుకు వస్తోంది ......

ఓ నాటి రాత్రి మా వీధిలో దొంగలుపడి పారిపోతున్నారు. వాళ్లను పట్టుకోవాటనికి అందరూ పరుగులు తీస్తున్నారు. నేనూ వాళ్లతో కలిశాను.

మాకు ముందున్న ఒక వ్యక్తి 'పట్టుకోండి పట్టుకోండి.. దొంగ .. దొంగ...' అంటూ ముందుకు ముందుకు దూసుకుపోతున్నాడు. అట్లా అట్లా నెమ్మదిగా చీకట్లోకి దూసుకుపోయి అంతర్ధానమయ్యాడు!

చివరికి తెలినదేమంటే అతడే అసలు దొంగ!!

అదే విధంగా అహంకారం తనను తాను రక్షించుకోవటానికి తరచుగా 'అహంకారం నాశనం కావాలి' అంటూ వూరికే నిరంతరం వదరుతూ వుంటుంది. ఇది తనని తాను రక్షించుకునే భద్రమైన ఎత్తుగడ!

కనుక 'నే నెవడను?' అని ప్రశ్నించుకోవటమే సూటిదారి.

# యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

వెంకన్న స్థిరచిత్తుడై, "స్వామీ! వీరి వ్యక్తిగత జీవితంతో నాకు నిమిత్తం లేదు. నేను ఈ మహోన్నత ముక్తిపథాన్ని పొందటానికి నా గురుదేవులే కారకులు అని నా దృఢవిశ్వాసం. తమకు నాపై పూర్ణానుగ్రహం ఉంటే నాతోపాటు నా గురుదేవులను కూడా తీసుకు వెళ్ళండి. ఇది మీకు అంగీకారం కాకపోతే, వైకుంఠపదం కంటె మహోన్నతమైన నా సద్గురు పాద పీఠం వద్దనే శాశ్వత నివాసాన్ని కోరుకుంటాను. నన్ను క్షమించండి" అని పలికిన వెంకన్న గురుభక్తికి, అచంచల విశ్వాసానికి, అకుంఠిత దీక్షకు ముగ్ధుడైనాడు. నిజానికి ఎప్పుడైతే వైకుంఠనాధుని ఒడిలో వున్న వెంకన్న పాదాలను పట్టుకున్నాడో, ఆ పండితుని అహంకార మమకారాలు వైకుంఠనాధునిలో లీనమయ్యాయి.



విద్యుత్‌ప్రవాహం ఉన్న తీగను, వట్టి తీగ తాకితే దానిలో కూడా విద్యుత్‌ప్రవాహం ప్రసారమైనట్లుగా వైకుంఠనాధుని దివ్యస్పర్శవలన భక్తి జ్ఞాన వైరాగ్యాలను పొంది, నిర్మలభక్తుడైన శిష్యుని మూలంగా, నిరతిశయమైన వైకుంఠపదమును అతడు పొందగలిగాడు. చెదరని విశ్వాసంతో, అకుంఠిత దీక్షతో గురుదేవులు ప్రసాదించినది దేనిని జపించినా అది మహామంత్రమై ఫలితాన్నిస్తుంది. గురుచరణారవిందముల యందు అతులిత భక్తివలన తాను తరించటమేగాక, తనను ఆశ్రయించినవారిని కూడా తరింపజేస్తాడు.

ఇందులో వెంకన్న చూపిన గురుభక్తిని గురించి వివరిస్తూ చక్కగా ప్రసంగం చెయ్యి. ఈ కథలో చెప్పబడిన గురుతత్త్వం నిన్ను ప్రభావితుణ్ణి చెయ్యటమేగాక, విన్నవారందరినీ కూడా చేస్తుంది. ఇది మాత్రం సత్యం.

మాతాజీ - మూడవ శిష్యునితో, నువ్వు దేనిమీద చెప్పదలచుకున్నావు?

మూడవ శిష్యుడు - అమ్మా! 1988 నవరాత్రి మహోత్సవాలలో శ్రీ బాబూజీ మహరాజ్, శ్రీవెంకటరమణ ప్రసాద్‌గారిని, శ్రీతారక పరబ్రహ్మ

ప్రసాద్‌గారిని నిల్చోబెట్టి శ్రీమద్భగవద్గీతలోని .....
యస్యసర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః ।
జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం, తమాహుః పండితం బుధాః ॥ 4/19
అనే శ్లోకం మీద చాలాసేపు చెప్పించారు. దాని గురించి తమరు వివరిస్తే దానిని గురించి చెప్పాలని ఉన్నది.

మాతాజీ - మంచిదే. నీకు ఈ శ్లోకం బాగానే గుర్తుంది. కాని ఆ రోజు జరిగిన సంవాదమంతా మాటలలో చెప్పటం కష్టం. అది శ్రీబాబూజీ మహరాజ్‌వారు మనకు అందించిన ఒక అలౌకిక అనుభూతి. ముందు ఈ శ్లోకం అర్థం తెలుసుకుందాం. ఈ విషయం గురించి చెప్పటానికి నువ్వు చాలా ప్రిపేర్ అవ్వాలి సుమా! నువ్వు చెప్పగలవు.

"ఏ ముముక్షువు యొక్క ద్రవ్యార్జన, లౌకిక వ్యాపారాలు మొదలైన కామసంకల్పాలు ఫలసంగ రహితమై ఉంటాయో, మరియు ఎవని జ్ఞానమనే అగ్నిలో వ్రేల్చబడతాయో అట్టివాడు పండితుడు అని విజ్ఞులు చెబుతారు". "ఆ రోజు శ్రీ ప్రసాదరావుగారు ఈ శ్లోకార్థాన్ని ఎన్ని విధాలుగా వివరించినా శ్రీగురుదేవులు ఒప్పుకోలేదు.

శ్రీ తారకంగారిని వివరించమనగానే ఆయన "ఏ మహాత్ముని కృపచేత అతని సకల కర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమయి, కామసంకల్ప వర్జితుడౌతాడో అతడే పండితుడు అని బుధులు చెబుతారు" అనగానే శ్రీబాబూజీ మహరాజ్‌వారు మెచ్చుకుని "సరిగా చెప్పావు" అన్నారు.

ఎందుకో తెలుసా? మనం కామవర్జితులం కావాలంటే, మన సర్వకర్మలు జ్ఞానాగ్నిలో వ్రేల్చబడాలంటే, గురువు అనుగ్రహం లేనిదే సంభవం కాదు. సద్గురువును ఆశ్రయిస్తే, ఆయన సాధకుని సంకల్ప రహితునిగా చేసి, అతని కర్మలను జ్ఞానగ్నిలో దగ్ధం చేసి, మోక్షపదానికి అర్హునిగా చేస్తాడు.

శ్రీబాబు "గీతాచార్యుడు 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి' అంటే, మీ హృదయబాబు 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి' అని ఘంటాపదంగా చెబుతున్నాడు" అన్నారు. ఇంతవరకు చెప్పి శ్రీబాబూజీ చెప్పిన ఒక దృష్టాంతాన్ని చెప్పు.

మూడవ శిష్యుడు - అదేమిటో తమరు శెలవియ్యండి.

-సశేషం



# శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ కీర్తనలు

రాగం : భీమపలాస్ తాళం: ఆది

పరమేశ్వరుని పరమ భక్తుల
పవిత్ర చరితలు వినరా
అందలి పరమార్థము రుచి గనరా
జన్మము తరించి సుఖమున మనరా ॥పర॥

సాలెపురుగు వల అల్లి భక్తితో స్వామికి కోవెల నిర్మించె ।
గజము గంగతో అభిషేకించి కలువల దళముల పూజించె ।
ఫణినాధుడు నిజ ఫణాగ్రమున గల మణి స్వామికి భూషణమిచ్చె
చర్మ చక్షువుల నిచ్చి కన్నడు జ్ఞాన చక్షువే సాధించె ।
పురుగైనా, పులుగైనా, మాలయైన, బ్రాహ్మణుడైనా,
నిర్మల హృదయుని నిశ్చల భక్తుని జన్మము ధన్యము చరితార్థమురా॥పర॥

నీవే నా గతి, కావు మనుచు కరి ఆ వైకుంఠుని రప్పించె ।
డింభకుడా ప్రహ్లాదుడు స్వామిని స్తంభమునందే వెలయించె ।
అబల సక్కు తన అత్తకు భర్తకు హరిచే సేవలు చేయించె ।
అతిథి సేవకై కబీరుదాసు తన సుతుని ప్రాణమే అర్పించె ।
పసివాడైనా, పశువైనా, జాతి ఏదైనా, జన్మమేదైనా,
నాధుడొకడెయని నమ్మిన వానికి లేదు జన్మ మరిలేనే లేదురా ॥పర॥

# కృష్ణా పుష్కర సత్సంగామృతం

- రమణ ప్రసాద్

"బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించినప్పుడు పుష్కరాలు వస్తాయ"ని శ్రీ గురుదేవులు మనకు చెప్పి ఉన్నారు. మనం ఎన్ని పుష్కరాలు చూశామన్నది ముఖ్యం కాదు. మనం ఎంత సాధన చేశామన్నది ముఖ్యం.

పాపం అంటే ఏమిటి? మనస్సుకు అశాంతి ఏర్పడటమే పాపం. ఆ పాప పరిహారం ఎలా చేసికోవాలోకూడా శ్రీ గురుదేవులు మనకు చెప్పి ఉన్నారు -" స్త్రీ మాతలు కూరలు కోస్తుంటే వాటిలో ఉన్న కీటకాలు కత్తి పీటకు ఎర అయితే, ఆ సమయంలో "ఓం కృష్ణ ఓం కృష్ణ కృష్ణాయ నమః - శ్యామ సుందర మదన మోహన కృష్ణాయ నమః" అంటూ భగవన్నామం చేస్తూ ఆ పని చేస్తే ఆ పాపం వారికి అంటదు" అన్నారు.

మనం ఎప్పుడు ఏ పని చేస్తున్నా మన ప్రభువుని మనం గుర్తు పెట్టుకుంటే, ఆ కర్మ ఫలం మనకు అంటదు. 'నా ప్రతి కదలిక భగవన్నిర్ణయం ప్రకారం జరుగుతోంది' అన్న పూర్తి విశ్వాసం ఉండాలి. 'ఏది జరిగినా, నిర్ణయకాలంలో నిర్ణయించిన ప్రకారం జరుగుతుంది' అనే నమ్మిక ఉండాలి.

ఒకసారి సరస్వతి నది "నువ్వు నదిగా మారిపో" అన్న కథనం ప్రకారం సాక్షాత్తు నారాయణుడే కృష్ణా నదిగా మారినట్లుగా తెలుస్తోంది. అదే విధంగా బ్రహ్మ, మహేశ్వరులుకూడా నదులుగా మారినట్లు శాస్త్రాలు చెబుతున్నాయి.

భగవత్పరంగా మనస్సు పెట్టి మనం చేసే పూజలు, జప ధ్యానాదుల వల్ల మనస్సు ఆనందం పొందుతోంది. అట్టి ఆనందం మనం విషయాదులలో పొందలేము. మహాత్ముల స్పర్శన సంభాషణాదులలో మనం అలౌకిమైన ఆనందానుభూతిని పొందుతాము.

నీటిని నారాయణ స్వరూపంగా భావించి స్నానం చేస్తే పుణ్య నదులలో మునిగిన ఫలితం కలుగుతుంది. మన పాత్ర పవిత్రమవుతుంది. కాని మన జీవితాన్ని పవిత్రంగా చేసేవారు శ్రీగురుదేవులొక్కరే అనే భావంతో ధ్యానం చేస్తే, ధ్యానం బాగా కుదురుతుంది. మన ఇంద్రియాలు నియంత్రణలోకి వస్తాయి. వీటికి అడ్డుగా నిలిచేవి కామ క్రోధాది గుణాలు. వీటిని భగవత్పరంగా మలచుకొని గోపికలు తరించారు. ఈ

కలియుగంలో మీరా, సక్కు, రామకృష్ణ పరమహంస మొదలైన ఎందరో మహాత్ములు తరించారు.

సర్వవ్యాపి అయిన సర్వేశ్వరుడు అక్కడెక్కడో ఉన్నాడనుకోకండి. మన హృదయమందిరంలో విరాజమానమై ఉన్నాడు. మనం ధ్యానంలో ఉచ్ఛ్వాస,నిశ్వాస, కుంభకాదులచేత మనం ఆయనను ఆరాధన చేస్తున్నాము. అదే మానసిక పూజ. మనలో నెలకొన్న గురుదేవులు మనకోసం అవతరించి వారు ముఖస్థుగా అందించిన బోధను చక్కగా విచారణ చేసి ఆచరించిన నాడు మనం తప్పక తరిస్తాము.

**ప్రాతరేవహి మానసాంతర్భావయే గురు పాదుకాం**



కృష్ణా పుష్కరాల సందర్భంగా శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంవారు నిర్వహించిన మహాయాగంలో వివిధ సేవలను అందించిన కట్టమూరు బాబూ భక్తసమాజ్

# లలాటరేఖ

(1992 సమర్థ సద్గురు సంచిక నుండి)

ఒక భక్తుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేశాడు. కొంతకాలానికి బ్రహ్మ ప్రత్యక్షమై 'నాయనా! నీ భక్తికి మెచ్చాను. ఏదైనా వరం కోరుకో!' అన్నాడు. ఆ భక్తుడు బ్రహ్మను చూసి పరమానందంతో 'దేవా! నీ దర్శన భాగ్యంతో నా జీవితం ధన్యమైనది' అన్నాడు.

"వత్సా! నీకు దర్శనం ఇచ్చి నేను ఊరికే తిరిగి వెళ్లలేను. ఏదైనా వరం కోరుకో" అని మళ్ళా అన్నాడు బ్రహ్మ. దానికి ఆ భక్తుడు ఆలోచనలో పడ్డాడు. ఏం కోరుకోవాలో స్ఫురించలేదు.

భక్తుడి మౌనాన్ని చూసి బ్రహ్మ "నీకేమి కోరికలే లేవా? వరాలేమీ అవసరం లేదా?" అన్నాడు.

అప్పుడు ఆ భక్తునికి ఒక ఆలోచన వచ్చింది. తనకు కలగబోయే సంతానానికి జీవితం సుఖసంతోషాలతో గడిచిపోతే అంతేచాలు అనుకొని బ్రహ్మతో "దేవా! నా బిడ్డల అదృష్టరేఖ నా చేతులమీదుగా వ్రాసే వరాన్ని నాకు ప్రసాదించు" అన్నాడు.

బ్రహ్మదేవుడు తన మనస్సులో "ఇంతవరకు నన్ను ఇలాంటి కోరిక కోరినవారెవరూ లేరు. ఇప్పుడు తీరా ఇస్తాను కోరుకోమని మాట ఇచ్చి, ఇప్పుడు ఇది తప్ప వేరేది అడుగు అంటే బాగోదు" అని ఆలోచించి మౌనంగా ఉండిపోయాడు.

బ్రహ్మ మౌనాన్ని చూసిన భక్తుడు తన అభిప్రాయాన్ని మార్చుకోకుండా స్థిరంగా బ్రహ్మయొక్క సమాధానం కోసం ఎదురుచూస్తూ అలాగే నిలబడిపోయాడు.

చిట్టచివరకు చేసేదిలేక బ్రహ్మ "అలాగే కానీ" అన్నాడు. భక్తుడు పరమానందభరితుడై, తపస్సు చాలించి, తన ఇంటికి తిరిగి వచ్చాడు. కొంతకాలం గడిచింది. భక్తునికి ఒక పుత్రుడు కలిగాడు. తన వరం సఫలం చేసుకునే అవకాశం దొరికినందుకు మురిసిపోయి ఆ భక్తుడు ఎంతగానో సంతోషిస్తూ, బ్రహ్మను ధ్యానిస్తూ "దేవా! నా కొడుకు అదృష్ట రేఖ నాచేతి మీదుగా వ్రాసే అధికారం ప్రసాదించు" అని ప్రార్థించాడు.

బ్రహ్మ తిరిగి ప్రత్యక్షమై "అలాగే కానివ్వు" అంటూ తన కిరీటాన్ని ఆ భక్తుని తలపై పెట్టాడు.

కానీ మరుక్షణమే ఒక వింత జరిగింది. భక్తుడు తన కొడుకు నుదుట అదృష్టరేఖలు లిఖించబోయేటంతలో అతని ముందు అప్పుడే పుట్టిన శిశువులు అసంఖ్యాకంగా కనిపించారు. వారందరూ తమ అదృష్ట రేఖలను తనను లిఖించమంటున్నట్లుగా భక్తుడికి అర్థం అయింది. వారిలో తన కొడుకు ఎవరైనది పోల్చుకోవటం భక్తునికి చాలా కష్టమై పోయింది. భక్తుడికి మతిపోయింది. అతడు తన ఎదుట అసంఖ్యాకంగా శిశువుల సంఖ్య పెరిగిపోతుంటే, కంగారుపడి, “దేవా! వీరిలో నా బిడ్డ ఎవరో చెప్పు” అని గట్టిగా కేక వేశాడు.

ప్రక్కనే కూర్చుని ఉన్న బ్రహ్మ, ఆ భక్తుడితో “పిచ్చివాడా! ఇప్పుడు నువ్వు నా పని చేపట్టావు. నీకిప్పుడు నీ బిడ్డ, పరాయి బిడ్డ అన్న వ్యత్యాసం ఎలా కుదురుతుంది? నా కిరీటాన్ని ధరించి, నా సంతానం మధ్యలో నువ్వు నీ బిడ్డను వెతకటం అవివేకం” అని తన కిరీటాన్ని భక్తుని తల మీద నుండి తీసివేశాడు.

ఆ భక్తుడికి ఇప్పుడు తన పిల్లవాడు కనిపించాడు. కాని వాడి నుదుట భాగ్యరేఖ లిఖించే శక్తి నశించింది!!



# గుణాలపై విజయం

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

మనం ఎవరినైనా జయించాలంటే ముందు వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. వారి బలాలేమిటో, బలహీనతలేమిటో కనిపెట్టాలి. మరి మనలోనే వున్న గుణాలను జయించాలంటే వాటిని గురించి కూడా మనం ముందుగా తెలుసుకోవాలి కదా. భగవద్గీతలోని 14, 17, మరియు 18వ అధ్యాయాలలో గీతాచార్యుడు యీ మూడు గుణాలయొక్క స్వభావాన్ని వివిధ ఉదాహరణల ద్వారా చక్కగా వివరించటం జరిగింది.

మనం చేసే ప్రతిపని, మనలోని ప్రతి ఆలోచన, మనకున్న అన్ని లక్షణాలూ ఈ మూడుగుణాలతో ప్రభావితమై వుంటాయి.అందుకే యజ్ఞం, దానం, తపస్సు, ధైర్యం, శ్రద్ధ, అవగాన, ఆహారం, కర్మలు - ప్రతి ఒక్కదాన్ని తీసుకుని అవి సత్వరజస్తమో గుణాలలో ఒకొక్కదానిచేత ప్రేరేరింపబడినప్పుడు, యే యే విధంగా ఉంటాయో చాలా వివరంగా చెప్పబడింది. వీటన్నిటిని గమనిస్తే మనకు అన్నిటిలో ఈ మూడు గుణాల యొక్క సహజలక్షణాలు కొంతవరకు అర్థమవుతాయి.

తమోగుణం - తమోగుణ ప్రధానులైనవారిలో మనం ముఖ్యంగా గమనించ వలసిన లక్షణం, తాము ఏ పనిచేస్తున్నామో, ఆ పనిని ఎలా చేయాలో, ఆ పనిని చేస్తే వచ్చే ఫలితమేమిటో తెలియకుండా ఏదో చేశామంటే చేశాం అనే రీతిలో చేయటం, ఎదుటివారు ఏమి చెప్పినా దానిని విపరీతార్థంలో అర్థం చేసుకోవటం. ఈ లక్షణానికి ప్రధాన కారణం అజ్ఞానం, సోమరితనం. నిజానికి ఇవి రెండూ వేరువేరని మనం అనుకుంటాం కానీ మన గురుదేవులు 'సోమరితనమే అజ్ఞానం' అని చెప్పారు.

రజో గుణం - రజోగుణ ప్రధానులైనవారికి ఏపని ఎలా చేయాలో బాగానే తెలుసు. విషయాలన్నీ బాగానే అర్థమవుతూ ఉంటాయి. చేసే పనులన్నీ తప్పులులేకుండా శ్రద్ధగానే చేస్తూంటారు. కానీ వీరు చేసే ప్రతి పని వెనుక స్వార్థం దాగి ఉంటుంది. ఏదైనా ప్రతిఫలాన్నో, పుణ్యాన్నో, పేరు ప్రతిష్ఠలనో ఆశించే వీరు ప్రతిపనినీ చేస్తారు.

సత్వగుణం - ఇక సత్వగుణ ప్రధానులైనవారు తాము చేసే ప్రతి పనిని ఎంతో శ్రద్ధగా చేస్తారు. కానీ ఏ పనికీ వీరు ప్రతిఫలాన్ని ఆశించరు.

శాస్త్రము లేదా గురువులు, పెద్దలు నిర్దేశించిన విధంగా ఆయా కర్మలను తమ కర్తవ్యంగా భావించి, నిరంతరాయంగా చేస్తుంటారు. కానీ ఎప్పటికీ దీని వలన నాకేమిఫలితం? అనిగాని, ఫలితంలేని పనులు ఎంతకాలమని చేస్తాం? అనిగాని ఆలోచించరు. ఎటువంటి ఫలితాన్నీ ఆశించకుండా, నేను చేస్తున్నాననే ఆలోచన లేకుండా, కేవలం భగవంతుడు తమతో చేయిస్తున్నాడనే భావనతో, అత్యంత శ్రద్ధాభక్తులతో తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు. అలాగే గురువులు, పెద్దలు చెప్పిన ప్రతివిషయాన్ని చక్కగా అర్థం చేసుకుని ఆచరణలో పెడతారు.

కనుక మనం ముందుగా తమోగుణాన్ని జయించాలంటే సోమరితనాన్ని వదిలిపెట్టి, గురువులను పెద్దలను ఆశ్రయించి, ఏపని ఎలా చెయ్యాలో శ్రద్ధగా తెలుసుకోవాలి. మన గురుదేవులైతే ఏ వంట ఎలా చేయాలి, అన్న దాని నుంచి ఏ పదార్థాన్ని ఎలా తినాలి, అన్న దాని వరకు; మొక్కలు ఎలా పెంచాలి, అన్నదాని నుంచి పూలు ఎలా కోయాలి, వాటిని భగవంతునికి ఎలా అలంకరించాలి అన్నదాని వరకు జీవితంలో ప్రతి విషయంలో ఎలా నడుచుకోవాలి, ఎలా ఆలోచించాలి, ఎలా అర్థం చేసుకోవాలి అన్నదానివరకు .......... ఇలా ప్రతి విషయాన్ని ఎంతో శ్రద్ధగా నేర్పించేవారు.

ఇలా నేర్చుకున్న విషయాలను ముందుగా ప్రతిఫలమో, పుణ్యమో, పేరు ప్రతిష్ఠలో ఆశించి అయినా సరే శ్రద్ధగా ఆచరించటం అలవాటు చేసుకోవాలి. ఇలా రజోగుణ సహాయంతో తమోగుణాన్ని జయించవచ్చు. ఇక ఆ తరువాత మనం ఆశించిన పేరుప్రతిష్ఠలో, పుణ్యమో, ప్రతిఫలమో మనకు ఎంతవరకు ఆనందాన్ని ఇస్తున్నాయి? ఎంతకాలం నిలిచి వుంటున్నాయి? అని విచారణ చేయటంద్వారా వాటి అశాశ్వతత్త్వాన్ని తెలుసుకోవటం ద్వారా, రజోగుణాన్ని దాటి సత్వగుణ ప్రధానులమై, నిష్కామ కర్మాచరణం అలవాటు చేసుకోగలం.

ఇలా కర్తృత్వ భావన లేకుండా, ఎట్టి ఫలితాన్ని ఆశించకుండా కేవలం భగవదాదేశం ప్రకారం కర్మలు చేస్తూ, అవికూడా ఆయనే చేయిస్తున్నాడు తప్ప నేను కేవలం ఒక పనిముట్టును మాత్రమే అనే భావనతో పనులు చేయటం కర్మలో అకర్మ అనబడుతుంది. దాని ద్వారా మనకు ఎట్టి కర్మఫలాలు అంటక చివరికి ఈ జన్మ పరంపర నుంచి మోక్షం సిద్ధిస్తుంది.

# మాయ

(పరమార్థ కథల నుండి)

శిష్యుడు - మాహప్రభో! తెలుపు మంచిదా? నలుపు మంచిదా?
గురువు - తెలుపు.
శిష్యుడు - మరి తెల్లజుట్టు చూసి జనులు ఏవగించుకుంటారేమి?
గురువు - అదే మాయ!

శిష్యుడు - మహాప్రభో! శరీరం దేనిచేత చేయబడినది?
గురువు - రక్తమాంసాదుల చేత
శిష్యుడు - మరి అట్టి శరీరాన్ని చూసి జనులు మురిసిపోతారెందుకు?
గురువు - అదే మాయ!

శిష్యుడు - మహాప్రభో! జీవితం ఎటువంటిది?
గురువు - మూణ్ణాళ్ళ ముచ్చట.
శిష్యుడు - మరి జనులు దాన్ని శాశ్వతమని భావిస్తూ, ఏదో మునిగి పోయినట్లు ప్రవర్తిస్తుంటారేమిటి?
గురువు - అదే మాయ!

శిష్యుడు - మహాప్రభో! ప్రపంచంలో శాశ్వతమైనది ఏది?
గురువు - భగవంతుడు
శిష్యుడు - మరి అట్టి భగవంతుని జనులు మరచిపోతున్నారెందుకు?
గురువు - అదే మాయ!

శిష్యుడు - మరి కడతేరటానికి మార్గమేదండి?
గురువు - ఆ భగవంతుని నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవటమే.
శిష్యుడు - మహాప్రభో! తమ బోధచే ధన్యుడనైతిని. శెలవు!!

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

## భాసుడు, విలాసుల కథ

"అతను ప్రాపంచిక కర్మపై మనసును లగ్నం చేయకుండా, కేవలము ఇంద్రియాల కదలికలతో చేస్తాడు, ఊయలలో పవ్వళించిన పసిపిల్ల, తన మనసు ప్రమేయం లేకుండా అవయవాలను సహజంగా కదలించినట్లు, జీవన్ముక్తుడు కార్య నిర్వహణ చేస్తాడు. లోపలవున్న మనసుతో నిమిత్తము లేకుండా, బాహ్య శరీరంతో చేసిన కర్మ కర్మయని పించుకోదు, ఆ కర్మ వలన వచ్చే సద్ఫలితముతో గాని, దుష్ఫలితముతో గాని, అతనికి నిమిత్తంలేదు, అనుకోని అదృష్టం కలిసి వచ్చినప్పడతను పొంగిపోడు, బాధ వచ్చినప్పడు కుంగిపోడు. జయాపజయాలు సంభవించినా రెండింటికి నిర్వికారంగా వుంటాడు."



"మనసును విషయ సుఖాలపై పరుగిడకుండా, అరికడితే, అది క్రమేపి అంతరిస్తుంది ఆ స్థితిని 'సుషుప్తి జాగ్రత్త' అంటారు. నది సముద్రంలో సహజంగా కలిసినట్లు, జీవాత్మ పరమాత్మలో లయమవుతుంది చూసేది, చూడబడేది, చూచేవాడు వొకడయినట్లు (త్రిపుటి) పరమాత్మ దివ్యానందముననుభవిస్తాడు, దానినే తురీయ స్థితి అంటారు. కోరికలన్నీ నశించినప్పడు, విస్తృతమైన మనసంతరించమే మోక్షము. మనసును దాని ఆలోచనలను మూలంతో నరికివేయాలి. ఆత్మ సాక్షాత్కారము లభించినపుడు, బంధమునకాస్కారమేది? ప్రశాంతమైన మనసుతో స్వేచ్ఛా జీవులయిన ముని పుంగవులు ఆత్మ జ్ఞానము కలిగివున్న వారెవరైనా భౌతికమైన తీవ్రకోరికలు, ఆరాటము నుండి సంపూర్ణ స్వేచ్ఛను పొందుతారు. కోరిక రాహిత్యము అవుతుంది. నిష్కామమనే గొడ్డలితో, సంసారమనే అరణ్యమును నరికివేయాలి, సంతృప్తి, ప్రశాంతత యనే వృక్షానికి పూసిన పూలగుత్తి నిష్కామము. నిష్కాముడైన మానవుడు హృదయమునకు సంబంధించిన బలహీనతల నుండి విముక్తుడు. సంపూర్తిగా నిష్కాముడైన వ్యక్తికి, యీ

విశ్వమంతా గడ్డిపోచతో సమానము.

"ఎవరైతే స్వస్వరూప (ఆత్మ) స్థితిలో వుంటారో, వారికి శారీరక స్పృహయేు వుండదు, వారు ప్రపంచములో యెన్ని ప్రలోభాల మధ్యవున్నప్పటికీ, వారి లక్ష్యాన్ని విస్మరించరు. వారు మానవాళి శ్రేయస్సుకై, ప్రపంచములో కార్య నిర్వహణ చేస్తున్నప్పటికి, వారి మనసులు మాత్రము బ్రహ్మమునందే కేంద్రీకరింపబడి వుంటాయి. దానికి తగిన వుపమానమేమిటంటే, వొక స్త్రీ తన గృహకృత్యముల నిర్వహణలో పూర్తిగా లీనమైనప్పటికి, ఆమె మనసు మాత్రం యెక్కడో దూరంగా వున్న తన ప్రియుని పైనే లగ్నమయి వుంటుంది."

"కోరికలన్నీ అంతరించినప్పడు, మానసిక సమతుల్యత మోక్షానికి దారి తీస్తుంది, నిష్కాములైన వ్యక్తులకు మోక్షమనే బహుమతి లభిస్తుంది. నిష్కాములైన వారే నిత్యానందులైన, జీవన్ముక్తులు, కోరికలతో కూరుకుపోయిన మనసు కలవారెప్పడూ బంధితులే! ఈ రెండు రకాల వ్యక్తుల కంటే అతీతమైన స్థితిలో వున్నవారు విదేహ ముక్తులు. అట్టి జీవన్ముక్తులు భవిష్యతులో జరిగే వాటికోసం ఆరాటపడరు, గతంలో జరిగిన వాటిని గురించి, చింతించరు. వారు చేసే కార్యాలన్నీ, ప్రపంచ స్థిరత్వము కోసం, క్షేమం కోసమే చేస్తారు. ప్రకృతిలో యే అరుదైన ప్రమాదము, సంఘటనలు జరిగినా, వారు భయపడరు, ఆశ్చర్యచకితులుకారు. ప్రకృతిలో విపరీత, అసహజ సంఘటనలు జరిగినా, అంటే సూర్యుడు చల్లబడినా, చంద్రుడు వేడెక్కినా, అగ్ని అధోముఖంగా మండినా, నదులు పైకి వుప్పొంగినా, వారు కించిత్తైనా చలించరు. మనసు యొక్క చలనమువలెనే, ప్రపంచమంతు లేని వైవిధ్యముతో గోచరిస్తున్నది. సముద్రపు నీరు చలించేటప్పటికనంతమైన అలలు వువ్వెత్తుగా యెగిరిపడ్డట్లు, మనో చంచలనము వలన, జగత్తులో, అంతులేని వైవిధ్యము గోచరిస్తున్నది."

అప్పడు శ్రీరామచంద్రుడు వశిష్ఠుని యిలా ప్రశ్నించాడు "మనో చాంచల్యమునకు కారణమేమిటి? దానినెలా నిగ్రహించాలి? ఈ విషయాలపై, నాకు వివరణ యివ్వమని, విజ్ఞప్తి చేస్తున్నాను".

- సశేషం

# దేవతార్చన - శ్రీరామకృష్ణ పరమహంస

ఒక గ్రామంలో పద్మలోచనుడు అనే బాలుడు ఉండేవాడు. వాడిని అందరూ 'పద్దయ్య' అని పిలిచేవారు. ఆ ఊరిలోనే ఒక పాడు పడిన దేవాలయం ఉండేది. దానిలో దేవతా విగ్రహమైననూ లేదు. ఆ ఆలయం నిండా చెట్లు, చేమలు మొలచాయి. అది గుడ్లగూబలకు, గబ్బిలాలకు అనుకూలమైన నివాసస్థలమైనది. ఒకరోజు సాయంత్రం హఠాత్తుగా ఆ ఆలయం నుండి జేగంట మ్రోతలు, శంఖారావాలు వినిపించసాగాయి. ఎవరో భక్తుడు ఆ గుడిలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు జరుపుతున్నాడని భావించి, ఆబాల గోపాలము అక్కడకు చేరారు. వారంతా చేతులుకట్టుకుని, ఆ పవిత్ర ధ్వనులను వింటూ, ఆ దేవతా విగ్రహ దర్శనమునకు ఎదురు చూస్తూ ఆలయం బయట చాలా రాత్రి వరకు వేచియున్నారు.

ఇహ తాళలేక ఒకడు ఆ తలుపు సందులో నుంచి లోపలికి తొంగి చూశాడు. తీరా చూస్తే ..... లోపల పద్దయ్య జేగంట వాయిస్తూ, శంఖం ఊదుతూ కనిపించాడు. అది చూసి అతడు ఆశ్చర్యపోయాడు! అక్కడ దేవతా విగ్రహం లేదు, అది ఎప్పటి లాగానే పాడుపడి ఉంది, కనీసం ఆలయాన్ని శుభ్రపరచను కూడా లేదు. ఎప్పటి వలెనె ఆలయ మంతా అసహ్యంగా ఉంది.

అంత ఆ వ్యక్తి కేక వేసి "ఓ పద్దయ్యా! నీగుడిలో పరమేశ్వర విగ్రహమే లేదు! పెంటలను తొలగించి గుడిని శుభ్రం కూడా చేయలేదు! పదకొండు గబ్బిలాలు అందులో చేరి దివారాత్రములు గీరుగారు మంటున్నాయి. ఆహా! ఏమియు లేనిదే, నీవిట్లు శంఖము నూది గందర గోళము చేస్తున్నావెందుకు?" అన్నాడు.

కాబట్టి నీ హృదయ ఆలయంలో దేవుని ప్రతిష్ఠింప దలచితే - వాని సాక్షాత్కారమును నీవు పొందగోరితే - ఊరక శంఖం ఊదినందున ప్రయోజనమేమి? మనస్సు పవిత్రమైన వెంటనే పరమాత్మ దానిని తన ఆలయంగా చేసుకుంటాడు. ఆయన స్వయంగా వచ్చి కూర్చుంటాడు. అపవిత్రస్థలములో వాని విగ్రమును ప్రతిష్ఠింపరాదు.

పైన చెప్పిన పదకొండు గబ్బిలాలు - పంచ జ్ఞానేంద్రియాలు,

పంచ కర్మేంద్రియాలు, మనస్సు - అనునట్టి ఏకాదశేంద్రియాలు. మొదట నీ హృదయాంతరాళమున బాగుగా మునిగి, అందున్న రత్నములను చేపట్టు. తరువాత నీకు సర్వము లభించగలదు. మొదట మాధవుని నీ మనస్సులో ప్రతిష్ఠించుకో. తరువాత ఎదుటివారికి కావలసినన్ని బోధలను చేయవచ్చు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2016

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 శుక్ర: భాద్రపద పౌర్ణమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 ఆది : శ్రీ గురు దశమి, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

అక్టోబర్ 2016

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

09 ఆది : దుర్గాష్ఠమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 సోమ : మహర్నవమి. ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

11 మంగ : విజయ దశమి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

29 శని : నరక చతుర్దశి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

30 ఆది : దీపావళి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2016

01 గురు : అమావాస్య.

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు సామూహిక వినాయక పూజలు, భక్తసమారాధన.

16 శుక్ర : భాద్రపద పౌర్ణమి - శ్రీసద్గురు పాదపూజ.

25 ఆది : శ్రీ గురు దశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాద పూజ.

29 గురు : మాస శివరాత్రి,, పావులూరు శాఖలో ఏకాహం

30 శుక్ర : అమావాస్య.

అక్టోబర్ 2016

01 శనివారము నుండి 13 తేది వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవములు

02 ఆది : గాంధీ జయంతి.

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ.

09 ఆది : దుర్గాష్టమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

10 సోమ : మహర్నవమి.

11 మంగ : విజయ దశమి - శ్రీజగన్మాతసామూహిక కుంకుమ పూజలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

12 బుధ : ఏకాహం, దీక్షా విరమణ, బీజ పూరిత మంత్రాక్షలతో శ్రీ మాతాజీ వారి ఆశీర్వచనం, సాయంత్రం 6గం.లకు జగన్మాత నగరోత్సవం,

13 గురు : రాత్రి 8గం. శ్రీసద్గురుపాదపూజా మహోత్సవం.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

29 శని : నరక చతుర్దశి, మాసశివరాత్రి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

30 ఆది : అమావాస్య - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సత్సంగ సమావేశాలలో సద్గురుదేవులు భక్తుల మనోభావాలను పరిశీలించటానికి అన్నట్లుగా చర్చలు జరిగేవి.



ఆయన సమక్షంలోనే కొందరు ఆవేశపూరితంగా, గట్టిగా కేకలువేసి మాట్లాడటం, ఒకరినొకరు విమర్శించుకోవటం జరిగేది. సద్గురుదేవులు సాక్షిగా వుండి అంతా గమనించేవారు. కొంతసేపు జరిగాక 'మీరంతా మాట్లాడుకుంటూ ఉండండి. నేను మళ్ళీ వస్తాను' అని వెళ్ళిపోయేవారు.

కొంత విరామం తరువాత సద్గురుదేవులు తిరిగి వచ్చి మాట్లాడుతూ "తుఫాను వచ్చి భీభిత్సం సృష్టించి, ఆ తరువాత ఉపశమనం కలిగితే ఎలా ఉంటుందో అంత ప్రశాంతంగా ఉంది" అనేవారు. ఇంకా మాట్లాడుతూ సద్గురుదేవుల సమక్షంలో ఆవేశపూరిత సంభాషణలు, వాదులాటలు, దూషణలు చేసేవారు ఎంతకాలం సాధనచేసినా, పురోగతి శూన్యమే సుమా! చేసిన సాధనంతా బూడిదలో పోసిన పన్నీరే సుమా!" అనేవారు.

ఒకనాటి సత్సంగ సమావేశంలో క్రమశిక్షణ గూర్చిన చర్చ వచ్చింది. కొంతమంది భక్తులు ఎవరెవరో వ్యక్తులగురించి స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. వారి ధన సంపాదన, కీర్తి ప్రతిష్ఠల గురించి, సంఘంలో వారికున్న పలుకుబడి గురించి ఎన్నో విషయాలు చర్చకు వచ్చాయి.

శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ "మానవుడు జీవితంలో సాధించ వలసినది ధనధాన్యాదులు సంపాదించటం, సంఘంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవటం, అంతకన్న ఏం కావాలి? అనుకుంటాడు. తన జీవితంలో సాధించ వలసినది ఇదేనా?" అప్పటికి అక్కడ కూర్చున్నవారందరికి విషయం అర్థం

అయింది.

"మానవుడి గమ్యం ఇదేనా?" అని ప్రశ్నించారు. ఇంకా మాట్లాడుతూ "ఇవన్నీ సాధించినా వట్టిచేతులతో మట్టిపాలు కావలసినదే కదా! తిరిగి జన్మకు రాక తప్పదు కదా! మానవజన్మ వస్తున్నదన్న గ్యారెంటీ ఉన్నదా? ఎవరు ధన్యజీవి? చెప్పండి" అన్నారు. ఎవరూ సమాధానం చెప్పలేదు. ఆయనే తిరిగి మాట్లాడుతూ "అసలు వస్తువును మరచి, వేరొక దానిని గురించి ఆలోచన చేయటమే అజ్ఞానము. ఆ విషయాన్ని గుర్తించిన వాడే ధన్య జీవి" అన్నారు శ్రీబాబు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

సెప్టెంబర్ 2016

05 సోమ : టీచర్స్ డే , సిద్ధి వినాయక చవితి - ఉదయం 11గం.లకు వినాయక పూజ; శ్రీసద్గురుపాదపూజ.

16 శుక్ర : భాద్రపద పౌర్ణమి - రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

అక్టోబర్ 2016

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ; ఉదయం 11గం.లకు కుంకుమ పూజలు.

09 ఆది : దుర్గాష్టమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

10 సోమ : మహర్నవమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

11 మంగ : విజయ దశమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ, శ్రీసద్గురుపాదపూజ.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి; శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

# పరమాత్మ దర్శనం

-సేకరణ మురళి

(వార్తాలాపము నుండి)

ఒక బ్రాహ్మణునికి భగవంతుని దర్శించవలెననే తీవ్రమైన కోరిక కలిగింది. భార్యకు నచ్చచెప్పి, అరణ్యానికి వెళ్ళి, ఒక మఱ్ఱి చెట్టు క్రింద భజన చేయటానికి కూర్చున్నాడు. ఇంతలో అటుగా నారద మహర్షి వచ్చాడు. ఆయనను చూసి యీ బ్రాహ్మణుడు “తమరెవరు స్వామీ” అని వినయంగా నమస్కరిస్తూ ప్రశ్నించాడు.

నారదుడు “నేను ఒకచోట స్థిరంగా ఉండనివాడను, త్రిలోక సంచారిని, నారదుడను” అని సమాధానం చెప్పాడు. “తమరి దర్శనమే నా మహద్భాగ్యము. నా యందు దయఉంచి, తమరు వైకుంఠము వెళ్ళినప్పుడు, స్వామిని నాకు దర్శనం ఎప్పుడు యిస్తారో అడిగి తెలిసికొని నాకు చెప్పవలసినది. మీరు తిరిగి ఎప్పుడు వస్తారు?” అన్నాడు. దానికి నారదుడు “రేపే వైకుంఠం వెళ్ళి, ఎల్లుండి తిరిగి వస్తాను. నీకు ఏ సంగతి సమాధానం చెబుతాను” అని చెప్పి వెళ్ళిపోయాడు.

నారదుడు వైకుంఠం వెళ్ళి, విష్ణుభగవానుని ఆ బ్రాహ్మణుడి గురించి అడిగాడు. దానికి విష్ణువు “అతడు దురదృష్టవంతుడు. అతడు కూర్చున్న మఱ్ఱి చెట్టుకి ఎన్ని ఆకులు ఉన్నాయో, అన్ని జన్మలు ఎత్తిన తరువాత అతనికి నా దర్శనం ఇస్తాను” అని చెప్పాడు.

నారదుడు తిరిగి ఆ బ్రాహ్మణుని దగ్గరకు వచ్చి, “నాయనా! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇప్పుడు తెలిసికోకపోవటమే మంచిది” అన్నాడు. కానీ, ఆ బ్రాహ్మణుడు అందుకు అంగీకరించక, నాకు అంతా వివరంగా చెప్పమని పట్టుపట్టాడు. ఇహ చేసేదిలేక నారదుడు వైకుంఠంలో జరిగిన సంగతి అంతా వివరంగా చెప్పాడు. అది విని ఆ బ్రాహ్మణుడు ఆనందంతో పొంగిపోతూ, “ఆహా! నాకు ఎంత అదృష్టం!! నాకు నా ప్రభువు దర్శనం ఇస్తాడు!” అన్నాడు. దానికి నారదుడు “ఓరీ! పిచ్చివాడా! చాలా జన్మల తరువాత కదా దర్శనము ఇచ్చేది” అన్నాడు.

దానికి ఆ బ్రాహ్మణుడు “అయినా! దర్శనము ఇవ్వటం నిజమే కదా!” అని పలికి ఆనందంతో నాట్యము చేస్తూ, “నేను నా ప్రభువును దర్శించగలను! నా స్వామిని దర్శించగలను!!........” అంటూ ఆనందంతో

గంతులు వేయసాగాడు. ఈ విధంగా అతని చిత్తము భగవంతుని యందు గాఢంగా నిమగ్నమైపోయింది. వెంటనే శ్రీహరి దర్శనమైంది!! ఇది చూసి నారదుడు మిక్కిలి ఆశ్చర్యపోయి, శ్రీమహావిష్ణువును కారణం అడిగాడు. అంతట పరమాత్మ "బ్రాహ్మణుని ప్రారబ్ధము అట్లే ఉన్నది. కాని భక్తి అనే త్రాడుతో నన్ను కట్టటం చేత, భక్తపరాధీనుడ నయ్యాను" అన్నాడు.

మాయా పదార్థాల యందు ప్రేమను విడిచి, భగవంతుని ప్రేమించండి. ఎంతటి కర్మలైనా నశించి, జన్మచరితార్థమవుతుంది. మాయా పదార్థములయందు ప్రేమను విడవటం చాలా కష్టం. మనస్సు చాలా బలమైనది. మనస్సు మదించిన ఏనుగువలె అన్ని విషయాదుల వైపుకి పరుగులుపెడుతుంది. దానిని వివేక జ్ఞానమనే అంకుశం ద్వారా ఏకాగ్రతను కలిగించుటచే, దాని చాంచల్యము పోయి, స్థిరత్వాన్ని పొందుతుంది. వజ్రము, వజ్రముచేతనే భేదింపబడుతుంది. అట్లాగే మనస్సును ఆపగలిగినది మనస్సు మాత్రమే!



**పాఠకులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు**

# పూజలెన్నో చేశాము పూర్వజన్మలో

- పెనుమాక నాగేశ్వరరావు

పూజలెన్నో చేశాము పూర్వజన్మలో
పుణ్యమెంతో పొందాము పూర్వజన్మలో
ఆ పూజాఫలమే మీ దర్శన భాగ్యమూ
ఆ పుణ్యఫలమే మీ పదసేవా భాగ్యమూ ॥పూజ॥

వీడేది లేదింక మీ చరణాలు ఈ జన్మకూ
కోరేది తీరేది ఇంకెంత మిగిలుందో ఈ జన్మకు
నేర్వేది నేర్చేది ఎంతెంత దాగుందో ఈ జన్మకు
మార్వేమి కోరంది దొరికింది బాగుంది ఈ జన్మకు ॥పూజ॥

తావేది లేదింక మాకు మరుజన్మకు
మరచి మనలేము, తరలి పోలేము మరుజన్మకు
తరచి అనలేము వదలి పోలేము మరోజన్మకు
దయచేసి దారి మూసేయి మాకు పునర్జన్మకు ॥పూజ॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

శ్రీరామశర్మ, నడుము వాల్చబోతూ, "నేను తెల్లవారుజామునే బయలుదేరి వెళ్ళాలి" అన్నాడు. 'అలాగేనయ్యా! మేము మీకు ప్రయాణం ఏర్పాట్లు చేస్తాము" అన్నారు నందయశోదలు. "దయచేసి ఆలస్యం చేయద్దమ్మా! నేను ఉదయమే మా ఇంట్లో ఉండాలి. చాలా ముఖ్యమైన పని ఉన్నది నాకు' అన్నాడు. "ఆ పని ఏమిటో వినదగినదయితే మాకు చెబుతారా?" అన్నాడు కన్నయ్య. "ఏమంత రహస్యం కాదు. రేపు మా నాన్నగారి ఆబ్దికం. ఆ పనుల కోసం నేను అక్కడ వుండాలి రేపు" అన్నాడు శ్రీరామశర్మ. "మీరేమో బాగా చదువుకున్నవారు. మాకేమో చదువు రాదు. ఆబ్దికం అంటే ఏమిటో చెప్పగలరా?" అన్నాడు కన్నయ్య అమాయకంగా!!



"మరణించిన జీవుడు తాను చేసిన పాప పుణ్యాల ఫలితంగా కొన్ని కొన్ని లోకాలలో తిరుగుతూ వుంటాడు. అలాగే మా పెద్దలు పితృలోకాలలో వున్నారు. వారిని ఆబ్దికం నాడు మంత్రాలతో పిలిచి ఆహ్వానించి, పూజించి, ఆహారం అందిస్తాము. అది విధి విధానం" అన్నాడు శ్రీరామశర్మ.

"ఎవరు చెప్పారు?" అని అడిగాడు కన్నయ్య. "మహాత్ములు. వారు గొప్పగొప్ప తపస్సు చేసి, ఆ బలంతో భగవదనుభూతిని పొంది, దాన్ని తరువాతి తరాల వారికి అందించారు. అలా అందుకుని ఆరగించినవారు అమృతస్వరూపులు అవుతారు" అన్నాడు శ్రీరామశర్మ. "అలాగ మీ పెద్దలు వచ్చి ఆరగించటం మీ రెప్పుడైనా చూశారా?" అని అడిగాడు కన్నయ్య. "లేదు బాబూ! మునుపెన్నడూ నేను చూడలేదు. అయినా అంత అర్హత నాకున్నదంటారా?" అన్నాడు శ్రీరామశర్మ. "వేదవేద్యుడైన ప్రభువుకి అసాధ్యమన్నది లేదు" అన్నాడు కన్నయ్య. ఆ రాత్రికి మాటలు ముగించి పడుకున్న తరువాత శ్రీరామశర్మ మనస్సులో కన్నయ్య రూపం, మాటలే నిలిచిపోయాయి!

వేకువజామునే కన్నయ్య లేచి, "జక్కన్నా! బండి కట్టు. ఈ అయ్య వారిని వారింట దగ్గర భద్రంగా దించి రావాలి" అని ఆజ్ఞాపించాడు

కన్నయ్య. "జక్కన్నకి అన్నీ తెలుసు. వాడు ఎరగనిది ఏదీ లేదు" అన్నాడు కన్నయ్య. శ్రీరామశర్మ మూటాముల్లె తీసుకుని బండి ఎక్కుతూ "యమునా నది దగ్గర ఆపితే, స్నానం చేసి వస్తాను" అన్నాడు శ్రీరామశర్మ.

బండి దిగి యమునలోకి దిగాడు. అప్పుడే సూర్యోదయం అవుతోంది. అంజలి ఘటించి, వేదమంత్రాలు చదువుతూ "చరాచరాలైన అన్ని భూతాలు ఎప్పుడూ ఏ దేవతను ప్రాతఃసంధ్యా సమయాలలో నమస్కరిస్తున్నారో, ఆ సంధ్యా దేవత నన్ను రక్షించుగాక! ఆ సంధ్యా దేవతకు నా నమస్కారము. ఏ సూర్యుడు ఆ సముద్రం యొక్క ఉపరి భాగం నుండి ఉదయిస్తున్న వానివలె కనిపిస్తున్నాడో, జలము యొక్క మధ్య భాగములో ప్రకాశిస్తున్నవానివలె తోచుచున్నాడో, విద్వాంసులకు ఎర్రని కిరణములు కలవాడుగను, ఉపాసకులకు సర్వ సంపదలను వర్షించువాడును అయిన ఆ సూర్య భగవానుడు నన్ను మనః పూర్వకముగా కాపాడుగాక!!

ఆపైన గాయత్రీ మంత్ర ధ్యానంతో "ముత్యము, పగడము, బంగారము, నీలము, తెల్లని రంగులును, మూడేసి కన్నులను, మూడేసి ముఖములను కలిగినదియును, చేతులయందు అభయముద్ర కలదియు, కపాలము, గదా, శంఖము, చక్రము, కమల ద్వయము ధరించి యున్నదియును అయిన ఆ గాయత్రీదేవిని సేవించుచున్నాను" అని ధ్యానిస్తుంటే, సూర్యగాయత్రి ఏకమై ఒకే తేజస్సు కలవారై కనిపించ సాగారు. ఆ వెలుగును ఆ కన్నులు చూడలేకపోయాయి. బ్రహ్మానంద భరితుడయ్యాడు శ్రీరామశర్మ.

-సశేషం

*సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా సెప్టెంబరు 2016, అక్టోబరు 2016 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

సెప్టెంబరు 2016 : AS 2640, 4768, 4811, 6911, 6912, 6914, 7152,
AS 7153, .7158, 7159, 7160, 7164, 7166.

అక్టోబరు 2016 : AS 2098, 4879, 5300, 6448, 6575, 6931,6934, 6938,
AS 6939, 7171, 7172, 7173, 7174, 7175, 7176,
AS 7177, 7180, 7181

– మేనేజర్

(గత సంచిక తరువాయి) # గీతాధ్యయనమ్ - రమణ ప్రసాద్

## 18. మోక్ష సన్న్యాస యోగము



ఇంతవరకు 17 అధ్యాయములలో తెలిపిన బోధలన్నీ సంక్షిప్తంగా ఈ అధ్యాయంలో చెప్పబడ్డాయి. ఈ అధ్యాయం గీతాసారమని, సంక్షిప్త గీత అని చెప్పవచ్చును. అర్జునుడు సన్యాసము యొక్క, త్యాగము యొక్క తత్త్వాన్ని తెలుపమని భగవానుని అడిగాడు.

సంన్యాసస్య మహాబాహో!తత్త్వమిచ్ఛామి వేదితుమ్।
త్యాగస్య చ హృషీకేశ! పృథక్కేశినిషూదన!॥

.అర్జునుడు: కృష్ణా! సన్యాసం, త్యాగం - వీటి స్వరూపం విడి విడిగా తెలుసుకొన దలిచాను. ఆ తత్త్వాన్ని నాకు బోధించు.

భగవానుడు : కామ్యానాం కర్మణాం న్యాసం,సంన్యాసం కవయో విదుః।
సర్వకర్మ ఫలత్యాగం,ప్రాహు స్త్యాగం విచక్షణాః॥ 2

ఫలాన్ని ఆశించే కర్మను విడిచిపెట్టడమే సన్యాసం అంటారు. సమస్త కర్మల ఫలితాలను వదలి పెట్టడమే త్యాగం అని అంటారు.

దోషం లేని కర్మ అంటూ ఉండదు. కనుక అన్ని కర్మలు విడిచిపెట్టాలి అంటారు. కాని కొందరు యజ్ఞం, దానం, తపస్సు - అనే కర్మలను పరిత్యజించకూడదని చెబుతారు.

అర్జునా! కర్మ త్యాగ విషయంలో నా నిర్ణయం విను: "త్యాగం మూడు విధాలు: యజ్ఞం, దానం ,తపస్సు - అనే కర్మలు చిత్త శుద్ధిని కలుగజేస్తాయి. అందువలన వీటిని విడిచిపెట్టకూడదు.తప్పకుండా చేయాలి.అయితే ఈ కర్మలు ఆసక్తిని, ఫలాన్ని విడిచి పెట్టి చేయటం ఉత్తమం. స్వధర్మానుసారంగా నిత్యం చేయవలసినకర్మలను విడిచి పెట్టడం మంచిది కాదు. అలాచేసే త్యాగం తామస త్యాగం అవుతుంది. దుఃఖాన్ని కలుగజేస్తాయి అనే భావనతోగాని, శరీరానికి శ్రమ అవుతుంది అనే భావనతోగాని నిత్యకర్మలను విడిచిపెట్టడం రాజస త్యాగం అవుతుంది. వేదాలు, శాస్త్రాలు విధించిన కర్మలు కర్తవ్య బుద్ధితో ఆసక్తిని, ఫలాన్ని

విడిచిపెట్టడం సాత్విక త్యాగం అవుతుంది. కర్మ ఫలాలను విడిచిపెట్టినవాడే త్యాగి."

"అర్జునా!సర్వకర్మలూ ఫలించడానికి సాంఖ్య యోగం ఐదు కారణాలు చెప్పింది. అవి- శరీరం, జీవాత్మ, ఇంద్రియాలు, వాటివేరు వేరు వ్యాపారాలు, దైవం. గుణ బేధాలనుబట్టి జ్ఞానం,కర్మ,కర్త అనే వాటిని సాంఖ్యయోగం మూడు విధాలుగా విభజించింది.అవి: జ్ఞానము, కర్మ, కర్త :-జ్ఞానం - అఖండమూ,అవ్యక్తము అయిన ఆత్మ వస్తువును చూసేవాడి జ్ఞానము, సాత్వికజ్ఞానము; వేర్వేరుగా కనిపించే సర్వభూతాలలోని ఆత్మలు అనేకం అని భావించడం రాజస జ్ఞానం; తత్త్వాన్ని తెలుసుకోకుండా, సంకుచిత దృష్టితో ఏదో ఒక దానిమీద ఆసక్తి కలిగిఉండేవాడిది తామస జ్ఞానం. కర్మ: ఆసక్తి, అభిమానం, అనురాగం, ద్వేషం, ఫలాపేక్ష లేకుండా శాస్త్ర సమ్మతంగా చేసే కర్మను సాత్విక కర్మ అంటారు. ఫలాపేక్షతో, అహంకారంతో ,ప్రయాసతో చేసే కర్మను రాజస కర్మ అంటారు. సాధక బాధకాలను, సామర్థ్యాన్ని, ఆలోచించక అవివేకంతో చేసే కర్మ తామసకర్మ అవుతుంది. కర్త : ఫలాపేక్ష, అహంభావం విడిచి ధైర్యోత్సాహాలతో జయాపజయాలను లెక్క చేయకుండా చేసేవాడు సాత్విక కర్త; అనురాగం , ఫలాపేక్ష, దురాశ తో చేసేవాడిని రాజస కర్త అంటారు; మనో నిగ్రహం, వివేకం,వినయం లేకుండా ద్రోహబుద్ధితో నిరుత్సాహంగా కర్మలు చేసేవాడిని తామస కర్త అంటారు."

"గుణ బేధాలను బట్టి బుద్ధి, ధైర్యము మూడేసి విధాలు: - బుద్ధి : కర్మ మార్గాన్ని, సన్యాసమార్గాన్ని, బంధాన్ని, మోక్షాన్ని, భయభయాలను గ్రహించే బుద్ధి సాత్విక బుద్ధి. ధర్మా ధర్మాలను, కార్యాకార్యాలను తెలుసుకోలేని బుద్ధి రాజస బుద్ధి. అజ్ఞానంధకారంలో అధర్మాన్ని ధర్మంగా, ప్రతిదానినీ విరుద్ధంగా, విపరీతంగా భావించటం తామస బుద్ధి. ధైర్యం : మనస్సు, ప్రాణం, ఇంద్రియాలు - వీటి వ్యాపారాలను యోగ సాధనతో నిలబెట్ట గలిగే నిశ్చల ధైర్యం సాత్విక ధైర్యం. ధర్మార్థ కామాల పట్ల అభిలాష, అభిమానం, ఫలాపేక్ష, కలిగి ఉండే ధైర్యం రాజస ధైర్యం. బుద్ధి లేనివాడు, నిద్ర, భయం, దుఃఖం, విషాదం, మదం - వీటిని విడచిపెట్టకుండా చేయటం తామస ధైర్యం."

'

-సశేషం

# జమదగ్నిమహర్షి

- రమణ ప్రసాద్

పూర్వం భృగు వంశజయుడైన ఋచీక మహర్షి కుశిక వంశజుడైన గాధిరాజు కూతురైన సత్యవతిని తనకు ఇచ్చి వివాహం చేయమని అడుగుతాడు. అతడు తన కూతురికి తగిన వరుడౌనో కాదో అని నిర్ణయించటానికి ఒక పరీక్ష పెడతాడు. తెల్లని దేహం, నల్లని చెవులు కల వేయి గుఱ్ఱాలను తెచ్చి ఇస్తే తన కూతురును ఇస్తానంటాడు. ఋచీకుడు వరుణదేవుని ప్రార్థించి అటువంటి గుఱ్ఱాలను తెచ్చి ఇస్తాడు. గాధిరాజు తన కూతురైన సత్యవతిని ఇచ్చి వైభవంగా వివాహం చేస్తాడు. సత్యవతి తన భర్తను దైవంగా భావించి పరిచర్యలు చేస్తోంది. ఋచీకుడు ఆమె సేవలకు సంతసించి వరం కోరుకోమనగా, పుత్ర



హీనులైన తన తలి తండ్రులకు ఒక కొడుకును, తనకొక కొడుకును ప్రసాదించమని కోరింది. ఋచీకుడు ఒక యజ్ఞం చేసి, ఆ యజ్ఞ పాయసాన్ని రెండు భాగాలుగా చేసి, మొదటి భాగాన్ని తన తల్లికి ఇచ్చి, రెండవ భాగాన్ని తనను స్వీకరించమని చెబుతాడు. పొరపాటున తను తీసుకోవలసిన భాగం తన తల్లికి ఇచ్చి, తల్లి కీయవలసిన భాగాన్ని తాను తీసుకొన్నది. ఋచీకుడు దివ్యదృష్టితో ఈ పొరపాటును గ్రహించినవాడై, సత్యవతితో," నీకు మహా క్రూరుడైన కొడుకు పుడతాడు. నీ తల్లికి బ్రహ్మభూతుడు, తపోధనుడైన కొడుకు పుడతాడు" అని చెప్పాడు. సత్యవతి భయపడి,"క్రూరుడైన పుత్రుని కనజాలను. కనికరింపమ"ని వేడుకొనగా, ఆమె మనుమనికి పుట్టబోయేవాడు అట్టి లక్షణాలు కలిగి ఉంటాడు అని చెప్పాడు. కాలక్రమంలో సత్యవతికి జమదగ్ని, తన తల్లికి విశ్వామిత్రుడు పుట్టారు.

జమదగ్ని ఉత్తమగుణ సంపన్నుడై రేణువు కూతురైన రేణుకను వివాహం చేసికొన్నాడు. తన తపోమహిమ చేత ఎందరికైనా, ఏదైనా

సమకూర్చే ఒక హోమధేనువును సంపాదించుకొని ఏ కొరత లేకుండా తపస్సు చేస్తూ కాలం గడుపుతున్నాడు..

ఒకనాడు పగటి సమయంలో జమదగ్ని రేణుకలు నర్మదా నదీ తీరంలో సంభోగించుచుండగా, సూర్యుడు బ్రాహ్మణ రూపంలో వచ్చి,"మహాత్మా! మీరు వేద కర్తలు, మహా తపసంపన్నులు, పట్టపగలు భార్యతో సంభోగించదగునా?" అని హితబోధ చేయగా, జమదగ్ని కోపించి," ఓయీ! పండితాహంకారంతో నాకు చెప్పవచ్చావు. నేను ధర్మాధర్మములెరుగని వాడనా? అజ్ఞాని స్వకర్మచేత జడీభూతుడౌతాడు. విజ్ఞాని, అగ్ని వలె మహాతేజస్వియై వెలుగొందుతాడు. అతనికి కర్మదోషములంటవు. తపోధనులైన మాకు నారాయణుడు సంరక్షకుడు. మా భావములతనికి అవగతములే. మమ్ము ఇతరులు శిక్షించటానికి అర్హులు కారు. నీవు మాకు రతి భగం చేశావు కాబట్టి రాహుగ్రస్తుడవై హతతేజుడవగుదువు గాక!" అని శపించాడు.

సూర్యుడు, " అయ్యా! మనం పరస్పరం పూజ్యులం. నువ్వు నన్ను శపించావు. నేను ఇప్పుడు నిన్ను శపించకపోతే నన్ను అశక్తుడుగా భావిస్తారు. నీకు ఒక క్షత్రియునిచే పరాభవం, అతని ఆయుధంతో నీకు మరణం కలుగుతుంది" అని ప్రతిశాపం ఇచ్చాడు. జమదగ్ని కోపంతో, నీవు శివుని చేతిలో ఓడిపోతావు" అని శపించాడు.

కశ్యపుని వల్ల బ్రహ్మ ఈ సంగతి తెలిసికొని. సూర్య జమదగ్నిల వద్దకు వచ్చి, సూర్యునితో," నీవు ఒక దినం రాహుగ్రస్తుడవు అవుతావు. వెంటనే ముక్తుడవు అవుతావు. మాలి సుమాలి యుద్ధంలో శివుడు నిన్ను జయిస్తాడు." అని జమగగ్నితో," మహాత్మా! పరాజయలజ్జితుడైన సూర్యుని విడిచిపెట్టు. నీ తేజంతో క్షణమాత్రంలో జగమంతా భస్మీభూతం అవుతుంది అనటంలో సందేహం లేదు. నీవు కార్త వీర్యుని చేత పరాభవం, ఓటమి, మరణం పొందుతావు. అయినా విష్ణుమూర్తి నీకు పుత్రుడుగా జన్మించి ఇరవైయొక్క సార్లు జగమంతా నిఃక్షత్రియం చేస్తాడు. నీ మరణం లోక కళ్యాణానికి కారణమవుతుంది" అనిచెప్పి అదృశ్యుడైయ్యాడు.

-సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

కవిగారిని చూడగానే శ్రీబాబు "రండి , రండి కవిగారూ! మీ కోసం ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ళకు మీ దర్శన భాగ్యం కలిగింది" అన్నారు. మనస్సును హరించే మందహాసము, అమృత వర్షము కురిపిస్తున్నట్లున్న వారి మధుర వీక్షణములు అన్నింటిని మించి "మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అనే మాటలోని ఆత్మీయత, అనురాగము కవిగారి హృదయమును పూర్తిగా గెలుచుకున్నాయి. భగవంతుడే భక్తుని దర్శనం కోసం ఎదురు చూడటమా? ఎంతటి వాత్సల్యము! ప్రథమ దర్శనంలోనే "ఇట్టి గురుమూర్తి భువిలోన లేడు, లేడు" అనే భావన కలిగింది కవిగారికి.



త్వరలోనే కవిగారి ఆహ్వానంపై శ్రీబాబు పోతునూరు వెళ్ళటం జరిగింది. అప్పుడే కవిగారి కుటుంబ సభ్యులందరికి శ్రీ బాబు యెడల 'గురు' భావన ఏర్పడింది. వారి మూడవ అమ్మాయి "వేణు"కు ఎందుకో శ్రీబాబు ఎడల ప్రగాఢమైన భక్తి కలిగింది. అప్పటినుంచి ఆ పాప ఎప్పుడు శ్రీ బాబు పోతునూరు వచ్చినా , శ్రీ బాబు దగ్గరనే ఉండిపోయేది.

పోతునూరులోనే గూడూరి రాఘవరావుగారు , వారి శ్రీమతి సీతారావమ్మగారు శ్రీబాబుకు భక్తులైనారు. సంతతిలేని వారిద్దరూ శ్రీబాబునే తమ పుత్రునిగా భావించుకుని సేవించుకునేవారు. శ్రీ బాబు కూడ వారి యెడల పితృభావంతోనే ఉంటూ ఎంతో చనువుగా స్వేచ్ఛగా వారింట్లో తిరిగే వారు. అర్థరాత్రి వేళ వచ్చి "అమ్మా! ఆకలిగా ఉంది ఏమన్నా పెట్టవా? " అనేవారు.

ఆమె లోపలికి వెళ్ళి ఏదో తెచ్చే లోపల మాయమయ్యేవారు. ఆమె "అయ్యో! బిడ్డ ఆకలిగా ఉన్నాడే! ఎటు పోయాడో! ఎప్పుడు వస్తాడో!" అని ఆ తెచ్చిన అటుకులో  కొబ్బరి ఉండలో కొంగున మూట కట్టుకుని పడుకుంటే , తరువాత శ్రీబాబు కదలకుండా వచ్చి , చెంగున కట్టినవి విప్పుకుని తినేసేవారు. ఆమె లేచి "అదేమిటి బాబూ?" అంటే అమ్మా! నా కోసం మూట కట్టుకున్నావని తిన్నానుగాని, నా ఆకలి తీర్చటానికి అవి కావాలా అమ్మా? నీ ప్రేమాభిమానాలతోనే నా కడుపు ఎప్పుడూ నిండుగా ఉంటుంది" అనేవారు.

పోతునూరు వచ్చినప్పుడు శ్రీబాబు పూజా పీఠమును వారింట్లోనే ఉంచేవారు. వారం పదిరోజులుండేవారు. ఒక్కొక్కసారి ఒకటి రెండు నెలలు ఉండిపోయేవారు. గుండుగొలను వచ్చినా అలాగే ఉండేవారు. ఆ రోజులలో శ్రీ బాబు ఎక్కడ ఉంటే భక్తులు అక్కడికి వెళ్ళేవారు.

వీళ్ళేగాక భీమవరం నుంచి, దిరుసుమర్రు నుంచి, కోరుకొల్లు నుంచి పెద నింద్రగొలను నుంచి, నిడమర్రునుంచి, ఇంకా ఎన్నెన్నో ఊళ్ళనుంచి శ్రీబాబు భక్తులు శ్రీ బాబు ఎక్కడ వుంటే అక్కడకు వచ్చేవారు. వారం, పది, పదిహేను, ఎన్ని రోజులైనా ఉండిపోయే వారు. ఇన్ని ఊళ్ళ భక్తులూ కలిసి, అన్నగారూ, వదినగారూ, బావగారూ, చెల్లాయీ, అక్కా, అమ్మ, బాబూ అని వరసలు కలుపుకొని ఒకళ్ళనొకళ్ళు పిలుచుకుంటూ, అన్ని పనులూ అందరూ కలిసి చేసుకుంటూ ఒకే కుటుంబంలాగా కలిసిపోయి, కాలాన్ని మరచిపోయి వ్రేపల్లెవాసులు శ్రీకృష్ణ పరమాత్మతో సంచరించినట్లుగా తన్మయత్వంతో రోజులను క్షణాల వలె గడిపివేసేవారు.

- సశేషం

-గత సంచిక తరువాయి

విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# సూరదాస్

గురువు లేనిదే భగవద్దర్శనం అవదు. జ్ఞానం లభించదు. భవసాగరాన్నుండి తరింపజేసే వాడు గురువు ఒక్కడే అని సూరదాస్ తన కీర్తనలలో తెలియ చేశాడు. గురు బిన ఐసో కోన్ కరే।



మాలా తిలక్ మనోహర్ బాణా లై సిర్ ఛత్రధరే॥
భవసాగర్‌వేం డూబత్ రహాకే
దీపక్ హాథ్ ధరే సూర్‌శ్యామ్ గురు ఐసో
సమరథక్షణమే లయివు ధరే॥

“గురువు తప్ప ఇంకొకరు ఎవ్వరూ తరింపచేయలేరు. నుదుట తిలకం, మెడలో మాల ధరించిన వాడు, శిరస్సున ఛత్రం ధరించిన నందనందనుడే నా గురువు. భవసాగరంలో మునిగే వాడిని పైకి తీసి క్షణంలో ముక్తిని ప్రసాదించగల సమర్థుడు నా శ్యామ సుందరుడు” అని అంటున్నాడు సూరదాసు.

గురు చరణన్ కీ ఆశా ప్రతిపల్
చహుదిశ్ ఘోర్ నిరాశా ప్రతిపల్॥
కుటిల్ కాల్ హై జాల్ భిఛాయే
మగ్‌మే వ్యాల్‌హై ఫన్ ఫైరాయే
జీవన్ తరి హై బీచ్ భవర్‌మే
కఛు నహి ఔర్ భరోసా ప్రతిపల్॥
దూర్ కినారా జీర్ణతరీహై
సంకట్ కీ జంజీర్ పడీహై
పావూ కైసే జ్ఞాన్ జ్యోతి మై
ఘేరత్ ఘోర దురాశా ప్రతిపల్॥

“నాకు ఒక్క గురుచారణాల పైనే ఆశ. నలువైపులా ఘోరమైన నిరాశే ఎదురు అవుతోంది. కుటిలుడైన కాలుడు వల పన్ని ఉంచాడు. మార్గంలో

పడగ విప్పి కాలమనే పాము బుసలు కొడుతోంది. నా జీవిత నావ సముద్రపు మధ్య ఉవ్వెత్తున వచ్చే కెరటాలకు ఊగులాడుతోంది. ఏ క్షణమైనా మునిగిపోతుంది. అలాంటి సమయంలో నా గురుచరణాలే నన్ను రక్షిస్తాయి అనే నమ్మకం గట్టిగా నాకు ఉంది.

తీరం చేరాలంటే చాలా దూరంగా ఉన్నది. పడవ ఓటిది. కెరటాల జోరుకి ఏక్షణంలోనైనా పడవ పగిలిపోవచ్చు. సంకటాలనే సంకెళ్ళు నన్ను కట్టివేశాయి. చుట్టూ ఘోరమైన దురాశ కమ్మి ఉన్నది. నేను జ్ఞానజ్యోతిని ఎలా పొందగలను? ఒక్క గురుచరణాలే నాకు దిక్కు అవే నన్ను తీరానికి సురక్షితంగా చేరుస్తాయి. నా గురుపాదాలే నాకు జ్ఞానజ్యోతిని ప్రసాదిస్తాయి" అంటున్నాడు సూరదాసు.

ఒకనాడు సూరదాసు రాధాకృష్ణుల ప్రేమతత్త్వాన్ని గానం చేస్తూ నడచి వెళుతున్నాడు. అది అర్ధరాత్రి సమయం. జోరుగా వర్షం కురుస్తోంది. వురుములు గర్జిస్తున్నాయి. చిమ్మచీకటిగా ఉంది. అతను కర్ర సహాయంతో అడుగులు వేస్తూ వెళుతున్నాడు. ఒకవైపు ముళ్ళపొదలు. ఇంకొకవైపు రాళ్ళ గుట్టలు. ఏమాత్రం కాలు జారినా లోతైన లోయలో పడటం ఖాయం. వానకు కాలు జారుతోంది. నిర్జనమైన ప్రదేశం. ఇంతలో కాలు జారింది. కర్ర చేయి జారింది. లోతైన లోయలో పడబోతుంటే ఎవరివో బుల్లి చేతులు అతని చేతిని పట్టుకున్నాయి. "తాతా! అటు కాదు ఇటు. నాతోరా నేను నిన్ను తీసుకు వెళ్తాను" అని కర్ర అతని చేతికి ఇచ్చి గమ్య స్థానానికి చేర్చాడు. ఆ మృదువైన చేతి స్పర్శ అతనికి అలౌకిక దివ్యానుభూతిని కలిగించింది. అప్పుడు సూరదాసుకు మనస్సులో ఒక ఆలోచన వచ్చింది. "ఎవరీ బాలుడు? ఇంత మనోహరంగా మాట్లాడుతున్నాడు.? అతని స్పర్శ నాకు ఆనందానుభూతిని ఇస్తోంది. ఇంత రాత్రి సమయంలో ఈ నిర్జన ప్రదేశంలో ఎలా వచ్చాడు? ఎక్కడ నుంచి వచ్చాడు" అనుకొని "నాయనా! నీ పేరేమిటి? నన్ను ఎలా రక్షించగలిగావు? ఏదీ నా దగ్గరకు రా!" అన్నాడు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL